# ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు ఉండదు





జిల్లా కేంద్రంలో కొత్తగా ఓటుహక్కు పొందిన కళాశాలల విద్యార్థినులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 23 : ఓటు వేయకపోతే ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు ఉండదని, వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఓటు వేయకపోతే పనికిరాని వాళ్లు రాజకీయాల్లోకి వస్తారని అన్నారు.ఆరోపణలు చేసే ముందు రాజకీయ నాయకులు ఆలోచించాలని సూచించారు. ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉంటే.. దేశమంత శక్తిమంతంగా ఉంటుందన్నారు. నిజామాబాద్‌లో కొత్తగా ఓటు హక్కు పొందిన కళాశాల విద్యార్థినులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు కవిత సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలంటే బ్రహ్మపదార్థమనో, సంబంధం లేదనో ఎవరు గెలిస్తే ఏమిటన్న అభిప్రాయంలో ఉండవద్దని సూచించారు. తిండి, గూడు, బట్ట ఎంత ముఖ్యమో స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమని, స్వేచ్ఛను కాపాడుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలని, సానుకూల దృక్పథంతో వాటిని వాడాలని సూచించారు. ప్రతిరోజూ వార్తాపత్రికలను చదవాలని, సమాజంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మంచి భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య ప్రక్రియలో క్రియాశీకలంగా భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఓటు వేయకపోతే రాజకీయాల్లోకి పనికిరాని వారు, జ్ఞానం లేని వారు వస్తారని, తద్వారా వారు తీసుకునే నిర్ణయాలకు ప్రజలంతా ఇబ్బంది పడుతారని చెప్పారు. అందులోనూ సరైన వారిని ఎన్నుకోవాలని సూచించారు. భారత సైన్యం ప్రతికూల వాతావరణ పరిస్థితిని తట్టుకుని కూడా దేశానికి రక్షణ కల్పిస్తుంటే కనీసం మనం లైన్‌లో నిలబడి ఓటు వేయలేమా అని ప్రశ్నించారు. ఓటు హక్కును వినియోగించుకోకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయన్నారు. హరితహారం కింద మొక్కలు నాటాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినప్పుడు అందరూ విమర్శించారని, కానీ ఇప్పుడు దేశంలోనూ ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో 7 శాతానికి పైగా అటవీ విస్తరణ పెరిగిందని తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలు, యువతకు ఏం సందేశమిస్తారని ఓ యువతి అడిగిన ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ ..రాజకీయాలు అంత సులువు కాదని, కానీ రాజకీయ నాయకులుగా తీసుకునే ఓ నిర్ణయం కోట్ల మంది జీవితాలను మార్చుతుందన్నారు. కష్టపడి ప్రజల కోసం పని చేయాలన్నారు. అన్ని చేస్తేనే ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. అన్ని ఆలోచించుకొని రాజకీయాల్లోకి రావాలన్నారు. వచ్చిన తర్వాత మాత్రం ప్రజల కోసం పని చేయాలన్నారు. కుటుంబ సభ్యుల మద్దతు లేకపోతే మహిళలు రాజకీయాల్లోకి రావద్దని ఆమె సూచించారు.

### 2.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం..

ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందని, స్వయం ఉపాధికి సహకారం, జిల్లాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటుపై యువతులు అడిగిన ప్రశ్నలకు కవిత స్పందిస్తూ .. దేశంలో ఎక్కడా లేని విధంగా 2.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. స్వయం ఉపాధి కోసం కూడా స్టార్టప్ వంటి వాటిని ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. టీహబ్, టీ వర్క్స్ వంటి వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. స్వయం ఉపాధికి ప్రభుత్వం చేయూతనిస్తున్నదని స్పష్టం చేశారు.

### తొలిసారి నా తల్లిదండ్రులతో కలిసి ఓటు వేశా..

తొలిసారి ఓటు వేసినప్పటికీ అనుభవం చెప్పాలని ఒక విద్యార్థిని కోరగా.. మొదటి నుంచి తన తండ్రికే ఓటు వేశానని, చింతమడకలో తొలిసారి తన తల్లిదండ్రులతో కలిసి ఓటు వేశానని, అది ఎప్పటికీ మరిచిపోలేని అనుభవమని అని కవిత చెప్పారు.

### తెలంగాణ కోసం బీఆర్ఎస్ పోరాడింది..

బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలని ఒక విద్యార్థిని ప్రశ్నించగా.. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడిందని కవిత సమాధానమిచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతిరోజూ రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పని చేస్తోందన్నారు. అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను స్వీకరించి మార్పులు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాలను సమానంగా చూస్తున్నామన్నారు. సానుకూల దృక్పథంతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తున్నదని, కాబట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కవిత సూచించారు.

# ఖాళీ కుర్చీలు.. కానరాని ప్రజలు



నడ్డా సభలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

- బీజేపీ సభ.. అట్టర్ ఫ్లాప్
- అరకొరగా వచ్చిన జనం
- పట్టించుకోని ఇందూరువాసులు
- ఇలా వచ్చి అలా వెళ్లిన జేపీ నడ్డా
- పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం

నిజామాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార పర్వంలో ప్రతిపక్ష పార్టీలు నిర్వహిస్తున్న సభలకు స్పందన కరువైంది. జనాలు లేక బీజేపీ, కాంగ్రెస్ కార్యక్రమాలు అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయి. మొన్న కామారెడ్డిలో కాంగ్రెస్ సభకు కర్ణాటక సీఎం అతిథిగా వచ్చినప్పటికీ జనాల నుంచి స్పందన కరువైంది. పీసీసీ చీఫ్ హాజరైన ఈ కార్యక్రమంలో ప్రజల కన్నా ఎక్కువగా ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడం గమనార్హం.తాజాగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం బీజేపీ నిర్వహించిన సభా కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఏకంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరైన బహిరంగ సభకు ఇందూరువాసులు మొఖం చాటేశారు. నడ్డా ప్రసంగ సమయానికి సగాని కన్నా ఎక్కువ ఖాళీగానే కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి వరుస కట్టి వస్తున్న బీజేపీ నేతలకు ఇందూరు గడ్డపై పరాభవమే ఎదురవుతోంది. సాక్షాత్తు మోదీ వచ్చినప్పటికీ ఈ ప్రాంతంలో జనాల స్పందన అంతంత మాత్రంగానే ఉండగా.. ఇప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడికి సైతం అదే స్థాయిలో స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించిన బీజేపీ ప్రచార సభ కొద్దిపాటి ఏర్పాట్లతోనే నిర్వహించినప్పటికీ అందులోనూ జనాలు లేక వెలవెలబోవడం కనిపించింది. బీజేపీ అధ్యక్షుడు ప్రసంగం మొదలు పెట్టే సమయానికి మైదానంలో అతి తక్కువ మంది కనిపించారు. వెలవెలబోతున్న సభికులను చూసి నివ్వెర పోయిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు దిక్కుతోచని స్థితిలో నాలుగు మాటలతోనే ప్రసంగాన్ని పరిమితం చేసుకోవాల్సి వచ్చింది. హెలికాప్టర్‌లో వచ్చిన ఆయనకు జనాలే లేకపోవడాన్ని గమనించి స్థానిక నాయకుల దుస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. జాతీయ స్థాయి అధ్యక్షుడి సభకు జనాలను పట్టుకొచ్చే దమ్ము లేదా? అంటూ ప్రశ్నించినట్లుగా స్థానిక నాయకులే చెప్పుకుంటున్నారు. మొత్తానికి జేపీ నడ్డా సభ తుస్ మనడంతో కాషాయ శ్రేణులు ఆగమాగమవుతున్నాయి. ఆయనో జాతీయ పార్టీకి అధ్యక్షుడే అయినప్పటికీ ఇందూరు వేదికగా అన్నీ అసత్యాలు వల్లించాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కనీసం చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. కేంద్రం ద్వారా జిల్లాకు ఒరిగిన ఒక్క మేలును కీర్తించుకోలేక పోయారంటే కేంద్రం చేసిందేమీ లేదన్నది ప్రజలు గ్రహించారు.

# తెలంగాణ ఊరికే రాలే..

- కుటుంబాలను వదిలి రోడ్లపైకి వచ్చాం..
- ఉద్యమ సమయంలో పడ్డ కష్టాలు ఎవరికీ తెలియదు
- స్వరాష్ట్రంలో రైతులను రాజుని చేసిన సీఎం కేసీఆర్
- పదేండ్లలో మారిన ఇందూరు రూపురేఖలు
- తెలంగాణ ఉద్యమ కారుడు సూదం రవిచందర్



నమస్తే ఇంటర్వ్యూ

ఖలీల్‌వాడి నవంబర్ 23: 'సమైక్యాంధ్ర ఉన్నప్పటి నుంచి తెలంగాణ ఉద్యమం నడుస్తున్నది. అప్పుడు ఎవరూ పట్టించుకునే వారేలేరు. నిధులు, నీళ్లు ఆంధ్రకు పోతున్నాయని, తెలంగాణ ఆగమవుతున్నదని ఉద్యమ సారథి కేసీఆర్ గుర్తించి తెలంగాణ ఉద్యమాన్ని మొదలు పెట్టారు. దీంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆయన పిలుపుమేరకు మేము ఉద్యమ బాట పట్టినం. ఉద్యమంలో ఎన్నో ఆటంకాలు, కుటుంబాలను వదిలి దీక్షలు, ధర్నాలు చేశాం. కేసులు పెట్టి, జైలుకి పంపితే వెళ్లాం.. తెలంగాణ వస్తే ఏం జరుగుతుంది. ఎలా మార్పు జరుగుతుంది. ఎవరికి లాభం జరుగుతుందని సీఎం కేసీఆర్ అందరికీ తెలియపర్చారు.' జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సూదం రవిచందర్ ఉద్యమ కాలం నాటి తన అనుభవాలనువివరించారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే... ఉద్యమ కాలంలో ఎన్నో కష్టాలు పడ్డాం. అడుగడుగునా ఆనాటి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. బస్సు అద్దాలు పగులగొట్టామని పోలీసులు అరెస్టు చేసి లాఠీలతో కొట్టారు. ఉద్యమాన్ని ముందుండి నడిపినం. అలా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇప్పుడు బంగారు తెలంగాణగా మారింది.

### రైతుని రాజు చేసిన సీఎం కేసీఆర్

దేశంలో ప్రతిపార్టీ రైతే రాజు అని చెప్పుకుంటూ వచ్చాయి. కానీ ఆ రైతు రాజు ఎలా అవుతాడని, ఎవరు చేస్తారని అనుకునేవాడిని. కానీ స్వరాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. వెంటనే రైతు బంధు, రైతుబీమా, ఎరువులు ఇవ్వడంతో రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయి. రైతుకు పెట్టుబడి సాయం రావడంతో అప్పు లేకుండా పోయింది. అప్పుడు తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుని రాజు చేశాడని.

కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆరు గంటల కరెంట్ అని చెప్పి మూడు నాలుగు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చేవారు. ఎండాకాలంలో ఇంట్లో ఉండని పరిస్థితి. రైతులకు నిద్రపట్టని దుస్థితి. రాత్రి ఒంటిగంటకు కరెంట్ వేస్తే కరెంట్ వైర్లు తగిలి, పాముకాటుకు గురై చనిపోయేవారు. వారి గోస తగిలి కాంగ్రెస్ కనబడకుండా పోయింది.

### పదేండ్లలో మారిన ఇందూరు

నిజామాబాద్ నగరం పదేండ్ల క్రితంఎలా ఉండేది. ఇప్పుడేలా ఉందో ఒక్క సారి చూడండి. డబ్బులు ఖర్చు అయితేనే అభివృద్ధి జరుగుతుంది. కాంగ్రెస్ హయాంలో ఒక్క అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వంద కోట్లతో చేపట్టామని గొప్పలు చెబుతున్నారు. ఇప్పుడు ఎన్ని కోట్లయితే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి అవుతుందో తెలుసుకోవాలి. మోదీ, రాహుల్‌గాంధీలు తెలంగాణమీదనే ఎందుకు పడుతున్నారు. అధికారం కోసం పోటీ పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలి. రోడ్డు విస్తరణ, సెంటర్ మీడియన్, మినీ ట్యాంకు బండ్, వైకుంఠధామాలు, నూతన ప్రభుత్వ కార్యా యాలు ఇవన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. 50 ఏండ్ల పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఇందూరును సుందరంగా తీర్చిదిద్దారు. వందల కోట్ల రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టారు. అభివృద్ధిలో తన మార్కును చూపించారు. ఏది ఏమైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్రాభివృద్ధి ఒక్క సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని అందరూ గ్రహించాలి.